క్లుప్తంగా

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ



కల్వకుర్తి రూరల్/వెల్దండ: కల్వకుర్తి మండలంలోని వెంకటాపూర్‌తో పాటు వెల్దండ మండలంలోని అజిలాపూర్, కుందారంతండా, లాలుతండాల్లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల వారు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు నిరంజన్, రమేష్‌గౌడ్ సూచించారు. కార్యక్రమంలో వెంకటయ్య, మల్లేష్, శేఖర్ యాదవ్, ఆశా కార్యకర్త కలమ్మ, రాములు, కుమార్, రవి, పరమేష్, తదితరులు ఉన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత

చారకొండ: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. నిర్వాహకులక పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు కలుపును తొలగించాలన్నారు. వచ్చే వనమహోత్సవానికి మొక్కలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి గణేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన కుర్మిద్ద మంగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. అదేవిధంగా తన్నీరు లక్ష్మయ్య కుటుంబానికి సోమవారం సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ నాయకులు కానుగుల జోగయ్య మంగమ్మ కుటుంబానికి రూ.5వేలు, లక్ష్మయ్య కుటుంబానికి రూ.3వేలు అందజేశాడు. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, నిరంజన్, చంద్రమోహన్‌రెడ్డి, ఆనంద్, వెంకటయ్య, జగన్, రాజు, రమేష్, ఆంజనేయులు, రాము, పుల్లయ్య, తిరుపతిరెడ్డి, రషీద్, శ్రీను, చంద్రయ్య, మహేష్, రాజు, నాగార్జున, సమీర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



అచ్చంపేట రూరల్: నల్లమలలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. డిప్యూటీ సీఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటారనే సమాచారంతో బీజేపీ నాయకులతో పాటు పలు పార్టీల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే ఆ పార్టీల నాయకులు ఇళ్ల వద్దకు వెళ్లి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

బెల్లి లలిత 26వ వర్ధంతి



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో బీసీ జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం బెల్లి లలిత 26వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ జన చైతన్య వేదిక యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాసుయాదవ్, తిరమల్, శేఖర్‌గౌడ్, స్వామి, ప్రవీణ్‌కుమార్, తగిలి వెంకటస్వామి, మల్లాజి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వెల్దండ: మండలంలోని రావిచెట్టుబావితండాకు చెందిన రైతు రాత్లావత్ మున్ననాయక్‌కు సంబంధించిన ఆవు సోమవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు పొలంలో ఆవు మేతమేస్తుండగా సమీపంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన పాడిఆవును పశువైద్య అధికారులు పరీక్షించారు. ఆవు విలువ దాదాపుగా రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సొంతింటి కల నెరవేరేనా?

- నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- బేస్‌మెంట్లకే పరిమితం
- పట్టించుకోని అధికారులు

తాడూరు: పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ప్రజాపాలన ద్వారా అధికారులు గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు గ్రామాల్లో పర్యటించారు. పారదర్శకంగా ఎంపిక కోసం ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. నాయకుల, అధికారుల సమన్వయంతో పేదలను గుర్తించారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంటింటికి తిరిగి ఇళ్లను పరిశీలించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేస్తూ అప్‌లోడ్ చేశారు.

ఏడాది కావొస్తున్నా..

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఏడాది పూర్తయ్యింది. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారు ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టారు. బేస్‌మెంట్ వరకు పనులు పూర్తిచేశారు. ప్రభుత్వం నుంచి డబ్బులు జమ కాకపోవడంతో పనులను నిలిపివేశారు. అర్హులు అప్పుచేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు కాని సకాలంలో డబ్బులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోవడంతో మరి కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

మండలంలోని గుట్టలపల్లిని పైలెట్ ప్రాజెక్టు కింద గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు 21 మందికి మంజూరు పత్రాలు అందజేశారు. నలుగురు మాత్రమే బేస్‌మెంట్ వరకు పనులు నిర్మించారు. ఇందులో ఇద్దరికి మాత్రమే రూ.లక్ష జమ చేశామని



గుట్టలపల్లిలో బేస్‌మెంట్‌కే పరిమితమైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

అధికారులు పేర్కొన్నారు. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

మండలంలో ఇలా..

మండలంలో 24 గ్రామ పంచాయతీలుకాగా గుట్టలపల్లి గ్రామాన్ని మోడల్ ఎంపిక చేశారు. మిగతా 23 గ్రామ పంచాయతీలకు గాను 525 ఇళ్లు మొదటి విడత కింద మంజూరయ్యాయి. గ్రామాల వారిగా అకునెల్లికుదురు 15, అల్లాపూర్ 20, అంతారం 20, బలాన్‌పల్లి 25, చర్లా ఇటిక్యాల 20, చర్ల తిర్మాలపూర్ 20, గోవిందాయపల్లి 20, గుంతకోడూరు



గుట్టలపల్లిలో ఇంటి నిర్మాణానికి ముగ్గుపోస్తున్న అధికారులు

25, ఇంద్రకల్ 30, ఐతోల్ 25, లచ్చిరాంతండా 15, మేడిపూర్ 25, నాగదేవపల్లి 15, పాపగల్ 25, పర్వాతాయిపల్లి 15, పోల్మూరు 15, సిర్సవాడ 30, తాడూరు 50, తుమ్మసుగురు 25, యాదిరెడ్డిపల్లి 25, ఎంగంపల్లి 15, యటిదార్‌పల్లి 25, యత్మాతాపూర్ 25 ఇళ్లు మంజూరయ్యాయి.

" అవగాహన కల్పిస్తున్నాం..



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రెండు విడతలుగా సర్వే నిర్వహించాంది. అర్హులైన వారిని గుర్తించి ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్నాం. అర్హులను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోయించాం.

– అంజనేయులు, ఎంపీడీఓ తాడూరు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ గ్రామానికి చెందిన రజియా బేగంకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.12,500 లు మంజూరయ్యాయి. సోమవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి మహిళా భర్త రుక్నుద్దీన్‌కు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దేవయ్య, పరశురాములు, కృష్ణయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లిలో..

పెద్దకొత్తపల్లి: మారెడ్‌మాన్‌దిన్నే గ్రామానికి చెందిన సందు తిరుపతమ్మ రూ.55000 లు, శిరీష రూ.16 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటస్వామి గౌడ్, బాలు నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలయ్య, వెంకటస్వామి, మహేష్ నాయక్, ఎల్లయ్యలు పాల్గొన్నారు.

కోడేరు: మండల కేంద్రానికి చెందిన ఆముదాల నాగరాజుకు రూ.27,500లు, మెహరాజ్ బేగంకు



కల్వకుర్తిలో చెక్కు అందిస్తున్న గోలి శ్రీనివాస్ రెడ్డి

రూ.13,500లు, మహెమూదా బేగంకు రూ.13 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సురభి చలపతిరావు, పాడేళ్ల సురేష్‌లు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు చామంతి రాజు, రాము, నాగోషి, అబ్దుల్, జగన్, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొదిల రామయ్య మాట్లాడుతూ ఎస్ఎస్ కన్సల్టెన్సీ కింద పని చేస్తున్న కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వివరించారు. జీతాలు చెల్లింపులో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని తెలిపారు. వేతనాలు మంజూరు చేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, బాలకిష్టమ్మ, రాధ, బాలమణి, రంజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

కల్వకుర్తి రూరల్: రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఇబ్రహీంకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందననారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలన్నారు. కొంతమందికే రుణమాఫీ, రైతుభరోసా ఇవ్వడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాలు, తడిసిన ధాన్యం పేరుతో క్వింటాలుకు 12 కేజీలు కోత విధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఏపీ మల్లయ్య, పులిజాల పరశురాములు, బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రభాకర్, రాజు, జగన్, మల్లేష్, జంగయ్య రైతులు పాల్గొన్నారు.

కమిషనర్ హామీతో సమ్మె విరమణ



సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

నాగర్‌కర్నూల్ రూరల్: రెండు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో సోమవారం మున్సిపల్ కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మెరుపు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిలి రామయ్య మాట్లాడుతూ కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కార్మికులతో మాట్లాడుతూ జీతాలు చెల్లించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. కార్మికులు బాలరాజు, భీముడు, రమేష్, వెంకటస్వామి, కృష్ణయ్య, వెంకటయ్య, వెంకటేష్, బాస్కర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐతోనే పేదలకు న్యాయం

నాగర్‌కర్నూల్ రూరల్: సీపీఐతోనే పేదలకు న్యాయం చేకూరుతుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆనంద్‌జీ అన్నారు. సోమవారం మండలంలోని గుడిపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. సీపీఐ పోరాటాల ఫలితంగా పేదలకు లక్ష ఎకరాల భూమి పంపిణీ చేశారని గుర్తు చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటయ్య, రవీంద్ర, ఆచారి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళ అదృశ్యమైన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. ఎస్ఐ గోవర్దన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన దివ్య ఈ నెల 20న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో బాధిత కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

భారీ వాహనాలతో బేజారు



అచ్చంపేట రూరల్: పట్టణంలో పట్టపగలే భారీ వాహనాలు రాకపోకలు కొనసాగించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధిక లోడుతో.. బండరాళ్లతో క్వారీ లారీలు రహదారుల గుండా వెళ్తున్నాయి. దీంతో వాహనదారులు, బాటసారులు బెంబేలెత్తిపోతున్నారు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ఓ టిప్పర్ బండరాళ్లతో వెనకాల జోర్ లేకుండానే వెళ్లడంతో వెనకాల ఉన్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు. పోలీసులు, రవాణా శాఖల అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దండ: మండలంలోని కొట్ర లక్ష్మీచెన్నకేశవ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొనుగోటి రవీందర్‌రావు రూ.45 వేలు విరాళంగా అందజేశారు. సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాములు, అల్లాజీ, కుమార్, ఆంజనేయులు, లక్ష్మయ్య, బాలస్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన

పెంట్లవెల్లి: మండలంలోని కొండూరు రైతు వేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హర్టికల్చర్ ఏఓ లక్ష్మణ్ మాట్లాడుతూ రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాం పంటను సాగు చేసుకోవాలని సూచించారు. ఒక ఎకరా వరి సాగు చేసే నీటితో 3–4 ఎకరాల ఆయిల్‌పాం సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఒక ఎకరానికి 50–57 మొక్కలు నాటుకోవచ్చని ఒక మొక్క రూ.193 లు ఉంటుందని ప్రభుత్వం సబ్సిడీ కింద ఒక మొక్క రూ.20లకే అందిస్తుందన్నారు. పంట సాయంగా ఎకరాకు రూ.4200ల చొప్పున 4 సంవత్సరాలకు గాను రూ.14800 లు అందిస్తుందని వివరించారు. 25–30 సంవత్సరాల పాటు ఈ పంట దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సలేశ్వరం, ప్రీయూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ శివ, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, రైతులు పాల్గొన్నారు.

చల్లని గాలులు.. వీడని ముసురు



తెలకపల్లిలో విత్తనాలు నాటుతున్న కూలీలు

కొల్లాపూర్: పట్టణంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ముసురు కురుస్తోంది. రోజంతా చల్లటి గాలులు వీచాయి. ముసురు పట్టడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. పట్టణ ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. రోడ్లు నిర్మానుష్యంగా కన్పించాయి. ఆదివారం కొల్లాపూర్‌లో 30 మి.మీ వర్షపాతం నమోదైందని ఏఎస్ఓ తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాత మట్టి మిద్దెల్లో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు సూచించారు.



కొల్లాపూర్‌లో కురుస్తున్న వర్షం

పొలం పనుల్లో రైతన్నలు బిజీబిజీ

తెలకపల్లి: వరుసగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను దున్ని విత్తనాలు విత్తుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో ఆయా గ్రామాల్లో రైతులు పొలం పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో విత్తనాలు విత్తుకుంటున్నారు.

మత్స్యకారులకు విముక్తి

పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం, వేముకల్లు, సోమశిల, అమరగిరి, మంచాలకట్ట ప్రాంతాలలో అలివి వలలు లాగడానికి కొంత మంది వ్యాపారస్తులు కూలీ పని కోసం ఇతర రాష్ట్రాలైన ఒడిస్సా, కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి ఏజెన్సీల ద్వారా అమాయకులను తీసుకొచ్చారు. కొన్ని నెలలుగా వెట్టిచాకిరీ చేయిస్తూ వేధిస్తున్నారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారు ఆయా రాష్ట్రాల్లోని లేబర్ అధికారులను కలిసి సమస్యను వివరించారు. దీంతో మహారాష్ట్రకు చెందిన లేబర్ అధికారి నాగర్‌కర్నూల్ జిల్లాకు చేరుకొని లేబర్ కార్యాలయంలో అధికారికి సమస్యను వివరించారు. ఇరువురు అధికారులు కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ విజయసింహను కలిశారు. వారు పోలీస్ సిబ్బందితో కలిసి వెట్టిచాకిరి చేస్తున్న ఆయా రాష్ట్రాల మత్స్యకారులను 38మందిని



పెంట్లవెల్లి హాస్టల్‌లో వలస మత్స్యకారులు

గుర్తించి వ్యాపారుల నుంచి విముక్తి కల్పించారు. వారి వివరాలను సేకరించి వారి రాష్ట్రాలను పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, నేషనల్ లేబర్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలాను రద్దు చేయాలని నిరసన

ఊర్కొండ: ఒక సర్వేలో ఉన్న నాలాను మరో సర్వేలో చూపంచారని దీంతో బాధిత రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న భూమి సర్వే నంబర్లు 221లో నాలా ఏర్పాటుకు నిర్ణయించారు. కాని ఆ నాలా అధికారుల నిర్లక్ష్య కారణంగా 308 నాలా ఏర్పాటు చేస్తునట్లు తప్పుడుగా ముద్రించారు. దీంతో పట్టాదారులు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. వీరికి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్ మద్దతు పలికారు. అక్రమ నాలాను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మండలంలో ప్రభుత్వ భూములు సైతం కబ్జాలకు గురైతు



నిరసన తెలుపుతున్న రైతులు

న్నాయని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వెంకట్, శివకుమార్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

లారీలు రాలే.. కేంద్రాల్లోనే ధాన్యం

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం

పాన్‌గల్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాల్లో పోసిన ధాన్యం తూకం వేయడం లేదు. తూకం వేసిన వాటిని తరలించేందుకు సక్రమంగా లారీలు రాకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో కేంద్రాల్లో ఉన్న ధాన్యం కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం ఆలస్యం అవుతుండటంతో పాటు వాతావరణంలో మార్పులతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో ధాన్యాన్ని ఆరబోయడం.. సాయంత్రం కాగానే వర్షం భయంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు కుప్పగా చేయడం దినచర్యగా మారిందని రైతులు వాపోతున్నారు. వీటికి అవసరమైన కవర్ల అద్దె భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క తూకం చేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సక్రమంగా లారీలు రాకపోవడంతో వాటిని కాపాడుకోవడం మరింత భారంగా మారిందన్నారు. మండలంలో తెల్లరాళ్లపల్లి, దావాజిపల్లి, రేమద్దుల, శాగాపూర్, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి తదితర గ్రామాల్లో ఇంకా ధాన్యం నిల్వలు ఉన్నాయి. సింగిల్‌విండో ఆధ్వర్యంలోని కేంద్రాల్లో 45 వేలకు పైగా ధాన్యం బస్తాల నిల్వలు, 2.30 లక్షల బస్తాల వరకు ధాన్యం



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

కాంటా చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. కేంద్రాల నుంచి ధాన్యం బస్తాలను తరలించేందుకు వచ్చే లారీల డ్రైవర్లకు రూ. 1000 చొప్పున ఎవరూ డబ్బులు ఇస్తే అక్కడికే లారీలను పంపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధాన్యం త్వరగా తూకం వేస్తూ, ధాన్యం బస్తాలను తరలించి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై సింగిల్‌విండో సీఈఓ భాస్కర్‌గౌడ్‌ను వివరణ కోరగా.. లారీల రాకలో జాప్యంతో బస్తాల తరలింపు, ధాన్యం సేకరణలో ఆలస్యం అవుతుందన్నారు. విషయాన్ని జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. దీంతో పాటు లారీ డ్రైవర్లకు డబ్బులు ఇచ్చే విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.



రేమద్దులలో ధాన్యం బస్తాలపై కవర్లు కప్పిన దృశ్యం